శ్రీనివాసులు ఇల్లంతా సందడిగా ఉంది. బంధువులు సన్నిహితులు హడావుడిగా తిరుగుతున్నారు. అతని భార్య ఉమావల్లి మాత్రం ఒంటరిగా ముందు గదిలో కూర్చుని మూగగా రోదిస్తోంది.

'ఈ' సమయంలో శ్రీనివాసులు ఉంటే ఏం చేస్తూ ఉంటాడు? అనుకుంది.

'బహుశా ఆదివారం కనుక ఏ మొక్కల మొగ్గలు విచ్చుకున్నాయో, నీళ్ళు వెయ్య లేదని ఏ మొక్కలు నొచ్చుకున్నాయో అనుకుంటూ ఆ మొక్కల చుట్టూ తిరుగుతాడు. తను వంట చేస్తుంటే తనకిష్టమైన పాకీజాలోని పాటలు, "ఇన్హీలోగోనే... ఇన్హీలోగోనె... చలో దిల్ దార్ చలో... చాంద్‌కే పాస్ చలో..." పాటలు పదే పదే వినిపిస్తాడు.

'ఇంకా అతను ఆదివారం చేసే పనుల జాబితాలో ముఖ్యమైన పని అతడి ద్విచక్ర వాహనం, తండ్రిగారు తొక్కిన పాత హెర్కులస్ సైకిలు, ఇంకా కొడుకులు చిన్నపుడు నడిపిన మూడుచక్రాల సైకిళ్ళు, వీటిని బాగా కడిగి మంచిముత్యాల్లా వుంచడం. ఇక చీకటి పడితే పెరట్లోవున్న తిరగలి, రుబ్బురోలు కడిగే పని మొదలుపెడతాడు. అవి అతడి తల్లిగారు వాడినవి.

"మీకిదేం పిచ్చి ఇంకా ఆ పాత సైకిళ్ళు, రుబ్బురోలు పాత్రలు దాస్తారెందుకు?" అని తనంటే "భలేదానివే, వాటిని చూస్తుంటే ఎన్నో జ్ఞాపకాలు, అనుభూతులు, నాన్న, అమ్మ మనమధ్యే ఇంకా తిరుగుతున్నట్టే అనిపిస్తుంది. వీటి గురించి మన పిల్లలు, వారి పిల్లలకు కథలుగా చెప్పేవరకూ వాటిని ఉండనీ..." అనేవాడు.


అలా ఆలోచనలో ఉండగానే ఆమెకు తిలక్ అమృతం కురిసిన రాత్రి పుస్తకం, తన కుర్చీక్రింద కనిపించింది. తిలక్ కవిత్వం భర్తకు చాలా ఇష్టం. పుస్తకంలో భర్త అండర్‌లైన్ చేసిన వాక్యాలవెంటే ఆమె కళ్ళు పరిగెత్తాయి.

తీరందాటి వెళుతున్న ఏకాకి నౌక చప్పుడు, ఆమెకు తన గుండె చప్పుడు స్పష్టంగా వినిపించినట్టయింది. తను ఏకాకి, కొడుకులున్నా... బంధుమిత్రులున్నా... తన గుండెచప్పుడు ఇప్పుడు వినేది ఎవరు?... అంతవరకూ మూగగా రోదించిన ఆమెలో దుఃఖం కట్టలుతెంచుకుంది. ఆమె ఏడుపు విని అంతా పరిగెత్తుకొచ్చారు.

"అలా దుఃఖపడితే ఎలా అమ్మా... గుండె రాయి చేసుకో, శ్రీనివాసులు లేని లోటు ఎవరూ తీర్చలేరు. నువ్వు శోకసముద్రంలో మునిగిపోతే, పిల్లలు తల్లడిల్లిపోతారు."

బంధువుల మాటలు మనసుకెక్కలేదు. ఏడుపును ఆపుదామనుకున్నా అది తన్నుకుంటూ ఉబికి వస్తోంది. శ్రీనివాసులు చనిపోయి అప్పటికి పదమూడోరోజు. ఆ కార్యానికి వచ్చిన బంధువులు, శ్రీనివాసులుతో పనిచేసిన ఉద్యోగులుచేస్తున్న పరామర్శలతో ఆమెకు విచారం మరింత ఎక్కువవుతోంది. ఆమెలో ఆందోళన, అభద్రతా భావం శ్రీనివాసులు మంచితనం గురించి వారు మరీ మరీ చెపుతుంటే ఆమె ఏడుపు ఎక్కువవుతోంది.

'ఔను శ్రీనివాసులు తనకు దేవుడే! తనను పిల్లల్ని ఏ లోటులేకుండా చూసుకునేవాడు. కొడుకులిద్దరూ మంచి చదువుల్లో పైకొచ్చారు. ఇల్లు కట్టారు. ఏ బాధ్యతలు, బరువులు తనకు అప్పగించకుండానే వెళ్ళిపోయాడు.



# పుత్రాదిచ్ఛేత్ పరాజయం

**- డాక్టర్ ఎం.సుగుణరావు**

ఆపరేషను టేబుల్ మీద మత్తు ఇంజక్షను ప్రభావంతో నిద్రలో ఉన్న శ్రీనివాసులు శాశ్వత నిద్రలోకి జారుకున్నాడు. అతడు లేని జీవితం ఊహించడానికే భయమేస్తుందామెకు.

ఇంతలో శ్రీనివాసులుతో సన్నిహితంగా ఉండే ఈశ్వరరావు లోపలికి రావడం చూసింది. అతను నమస్కారం చేసి బైట భోజనాలుచేస్తున్న ఆఫీసు ఉద్యోగులవైపు నడిచాడు. అతడితో ఆమె ఏదో చెప్పాలనుకుంది. అయినా మాట పెగల్లేదు. ఇప్పుడెందుకులే, ఇంకోరోజు మాట్లాడదాం...' అనుకుంది.

* * *

ఈశ్వరరావు వేగంగా, భోజనాలు సాగుతున్న వైపు నడిచాడు. ఒక ప్లేటు తీసుకుని కావలసినవి వడ్డించుకున్నాడు. తన సహ ఉద్యోగులతో మాట్లాడుతూ అన్యమనస్కంగా తింటున్నాడు. ఉమావల్లి తనతో ఏదో చెప్పాలనుకున్నట్టు అతడికి అర్థమయింది, ఆమె ముఖం చూడగానే!

'కొంపదీసి ఆ విషయమా?' అనుకున్నాడు. అతనికి గిల్టీగా అనిపించింది. తింటున్న ప్లేటును సగంలో వదిలేసి చేతులు కడిగేసుకున్నాడు.

ఇంతలో స్కూటర్ పార్క్‌చేసి వస్తున్న దివాకర్. శ్రీనివాసులుగారి సెక్షనే. వస్తూనే "నాకు ఉమావల్లిగారితో పరిచయం లేదు, ఒకసారి పరామర్శించి వద్దాం..." అన్నాడు ఈశ్వరరావుకు గుండెలో రాయిపడినట్టయింది. భయంగానే దివాకర్‌తో లోపలకు నడిచాడు. దివాకర్ ఆమెకు నమస్కారం చేసి, "అమ్మా శ్రీనివాసులు సాక్షాత్తూ ఆ శ్రీనివాసుడే నెల క్రితం అత్యవసరంగా డబ్బు అవసరం వచ్చింది మా అబ్బాయికి ఎపెండిసైటిస్ ఆపరేషన్, పాతిక వేలు శ్రీనివాసులుగారే సర్దారు. ఒక వెయ్యి రూపాయలు అప్పుగా ఇవ్వడానికి అందరూ వెనకాడే ఈరోజుల్లో ఏ సంతకం, భరోసా లేకుండా పాతికవేలు సర్దారు. ఈ ఆపత్కాల సమయంలో వాటిని మీకు ఇచ్చెయ్యడం నా బాధ్యత." అంటూ కవరులో వుంచిన నోట్లకట్టలు ఆమె చేతిలో ఉంచి కదిలాడు. ఆ మాటలు విని ఈశ్వరరావు అక్కడనుంచి కదులుతుంటే "అన్నయ్యగారూ... ఒక్కమాట," అంటూ ఉమావల్లి పిలిచింది. అతడి గుండెలో ప్రకంపనలు మైగాడ్, అనుకున్నంతా అయింది, తను శ్రీనివాసులు దగ్గర తీసుకున్న యాభయివేల సంగతి తెలిసిపోయినట్టుంది... ఆ డబ్బు ఇవ్వడం అంత అవసరమా! తనిప్పుడు లేడు, ఏ సాక్ష్యమూ లేదు, ఎప్పుడో ఇచ్చేసాను... అని అబద్ధం ఆడితే... అలా ఆలోచిస్తూనే ఆమె దగ్గరకు నడిచాడు.

"అన్నయ్యా, ఒక సహాయం చెయ్యాలి, పాపం ఈయనకు బాకీపడ్డ వాళ్ళు ఇచ్చేస్తున్నారు. అలాగే ఈయనా ఎవరిదగ్గరైనా అప్పుతీసుకున్నారేమో... రెండు నెలల క్రితం మేం కంప్యూటర్ కొన్నప్పుడు తను ఎవరికి బాకీపడ్డారో, మాకు ఎవరు డబ్బు ఇవ్వాలో, ఆయనకు కంప్యూటర్‌లో ఫీడ్ చేయడం తెలీక మీచేత చేయించారు, నాకు కొంచెం దయచేసి చెపుతారా... ఎవరిదగ్గరైనా అప్పు ఉంటే ఈయనకు నిద్రపట్టేది కాదు..." అంది.

ఆ మాటలతో ఈశ్వరరావుకు మళ్ళీ మనసులో భయం కలిగింది. తను, ఇంకో ఇద్దరూ తీసుకున్న అప్పు వివరాలు ఆ కంప్యూటర్‌లో తనే స్వయంగా టైప్ చేసాడు. అలాగే శ్రీనివాసులు ఎవరికివ్వాలో ఆ పేర్లూ తనే కంప్యూటర్‌లో ఫీడ్ చేసాడు. ఇప్పుడేమిటి దారి? క్షణం సేపు ఆలోచనలో పడ్డాడు. 'ఔను, ఆవిడకు కంప్యూటర్ పరిజ్ఞానం లేదు, ఆ లిస్టులోంచి తన పేరు తీసేస్తే సరి అనుకుని గబగబా ఆ కంప్యూటర్ వుంచిన గదిలోకి నడిచాడు. చాలావేగంగా అతని వేళ్ళు కంప్యూటర్ కీబోర్డు మీద కదిలాయి... ఆరోజు తనే పెట్టిన 'ఋణం' అనే ఫైల్‌లోకి ఎంటరయ్యాడు.

ఆ ఫైలు ఓపెన్ చేసేసరికి ఈశ్వరరావుకు షాక్ కొట్టినట్టయింది. శ్రీనివాసులు ఎవరిదగ్గర అప్పుతీసుకున్నాడో ఆ లిస్టు మాత్రమే ఉంది.

'మైగాడ్ తనకు ఎవరు ఇవ్వాలో వారి పేర్లు తీసేసాడు, ఇదంతా ఎప్పుడు చేసాడు?' ఆలోచనల్లో బుర్రవేడెక్కిన ఈశ్వరరావుకు వెంటనే గుర్తుకొచ్చింది. తను తెల్లవారితే ఆస్పత్రిలో బైపాస్ ఆపరేషనుకు చేరతాడనగా ఫోన్ చేసాడు. "కొంత సమాచారం డిలీట్ చేయాలంటే ఏ కమాండ్ ఇవ్వాలని? తను వెంటనే చెప్పాడు.

ఆపరేషన్ టేబుల్‌మీద తను చనిపోతే అప్పుతీసుకున్న వాళ్ళకూ, తన భార్యకు ఏ ఇబ్బందీ ఎదురుకాకూడదని డబ్బు ఇవ్వవలసిన వాళ్ళ పేర్లు తీసేసాడా? వాళ్ళంతా తన స్నేహితులు కనుక డబ్బు విషయంలో సంబంధాలుపోవడం ఇష్టంలేక ఈ పని చేసాడా? అంతటి ఉన్నతుడైన స్నేహితుడికి తను ఇచ్చే ప్రతిఫలం ఏమిటి? అయినా యాభైవేలు తిరిగి ఇవ్వడానికి మన సొప్పటం లేదు, ఇప్పుడు కంప్యూటర్ సాక్ష్యమూ లేదు... ఏంచెయ్యాలి?... ఏదీ తేల్చుకోలేకపోతున్నాడు.

ఆలోచిస్తూనే గుమ్మం బైటకొచ్చాడు ఈశ్వరరావు. మనసులో ఘర్షణ. దూరంగా అతడి కొడుకు వస్తూ కనిపించాడు. "ఏమిటీ వాడు ఇక్కడికి వస్తున్నాడు? నిన్ననే వాడి ఆఖరి పరీక్ష అయింది. తను ఇక్కడున్నాడని తెలిసి వస్తున్నాడా? అనుకున్నాడు.

ఆయాసపడుతూ వచ్చిన కొడుకు "నాన్నా అంకుల్ గారికి ఇవి ఇవ్వాలికదా. అందుకే తీసుకువచ్చా..."

"ఏమిటవి? అన్నాడు ఈశ్వరరావు కొడుకు మాటలకు ఆశ్చర్యంగా."

"మరిచిపోయావా నెలరోజుల క్రితం అంకుల్‌గారూ. మనము స్టేషనరీ షాపుదగ్గర కలిసిన విషయం..." అన్నాడు.

"ఔను గుర్తొచ్చింది...!" అనుకుంటూ నెలక్రితపు జ్ఞాపకాలలోకి వెళ్ళాడు.

ఆరోజు ఆదివారం. కొన్ని రోజుల్లో కొడుక్కి టెంత్ పరీక్షలు మొదలవుతాయి. కొత్త పెన్ను కొనిద్దామని స్టేషనరీ షాపుకొచ్చాడు. ఆ సమయంలో శ్రీనివాసులూ అక్కడకొచ్చాడు. అతడి చేతిలో ఖరీదైన రెండు పార్కర్ పెన్నులు. వాటిని ఈశ్వరరావుకు చూపిస్తూ.

"వీటిని రీఫిల్ వేయిద్దామని తీసుకొచ్చాను, నేను కాలేజీలో పరీక్షలు రాసేందుకు ఉపయోగించాను, ముప్పయ్యేళ్ళ క్రితం. తర్వాత నా కొడుకులిద్దరూ వాడారు. తిరిగి నా మనవలకోసం వీటిని దాస్తున్నాను. అఫ్‌కోర్స్ వాళ్ళింకా పుట్టలేదనుకో..." అన్నాడు నవ్వుతూ.

"అంకుల్ వీటిని చూడవచ్చా" అన్నాడు కొడుకు.

"చూడ్డం ఏమిటి? రేపట్నించి పరీక్షలు వీటితో రాయి, రైటింగ్ బావుంటుంది..." అన్నాడు శ్రీనివాసులు.

"వద్దంకుల్, నాకు భయం, అవి పోతాయేమో...!" అన్నాడు కొడుకు.

"ముప్పయ్యేళ్ళుగా ఇవి మా దగ్గర క్షేమంగా ఉన్నాయి, భయపడకు... వీటిని తీసుకుని పరీక్షలు బాగా రాయి, ఆ తర్వాత ఇవ్వు... మా మనవలకోసం, అంటూ బలవంతంగా తన కొడుకు జేబులో ఆ రెండు పెన్నులు ఉంచాడు శ్రీనివాసులు.

**ఇప్పుడు అతని మనసు నిర్మలంగా ఉంది. దురాలోచనలనుంచి దూరం అయ్యాననే సంతృప్తితో ఉమావల్లి తన గదిలోకి నడిచాడు. ఆమెకు రెండుచేతులూ జోడించి- "అమ్మా... నేను శ్రీనివాసులు దగ్గర యాభైవేలు అప్పు తీసుకున్నాను, కొద్దిరోజుల్లో తిరిగి ఇచ్చేస్తాను. ఆయన దగ్గర అప్పు తీసుకున్నవాళ్ళంతా తిరిగి ఇస్తారనే నా నమ్మకం...**

ఆ విషయం అంతా గుర్తుకొచ్చింది ఈశ్వరరావుకు. అతను ఏదో చెప్పబోతుంటే కొడుకు గబగబా ఉమావల్లి ఉన్న గదిలోకి నడిచాడు. ఈశ్వరరావు కొడుకు వెంటే వెళ్ళాడు "సారీ ఆంటీగారూ, ఈ పెన్నులు అంకుల్‌గారికి స్వయంగా ఇద్దామనుకున్నాను, పాపం ఆయన వేరు, వీటిని మీరు మీ మనవలకోసం దాచి ఉంచండి జాగ్రత్తగా, అంకుల్ గారికి అదే ఇష్టం..." అన్నాడు ఈశ్వరరావు కొడుకు.

ఆ మాటలకు ఉమావల్లి కళ్ళల్లో నీళ్ళు. ఆ అబ్బాయిని దగ్గరకు తీసుకుని గట్టిగా ఏడ్చింది... ఆ దృశ్యం చూసిన ఈశ్వరరావు తలొంచుకున్నాడు. కారణం తను ఓడిపోయినందుకు, సహచరుడు శ్రీనివాసులు చేతిలోనే కాదు, పుత్రుడిలో ఎదురయిన పరాజయం. శబ్దం రాకుండా అతను మూగగా రోదిస్తున్నాడు.

అతడికి గుండె కోస్తున్నట్టుగా అనిపించింది. న్యూనతాభావంతో తలొంచుకున్నాడు.

పిల్లలు తప్పుచేస్తే పెద్దలు శిక్షవేస్తారు. మరి పెద్దలు తప్పుచేస్తే! అతడిలోని ఆలోచనలు కల్లోల పరుస్తున్నాయి. కొడుకు ఉమావల్లికి పెన్నులు ఇచ్చేసి, "నాన్నా నేను ఇంటికి వెళ్ళిపోతున్నాను..."అని చెప్పిన మాటలు అతడికి వినబడలేదు. ఆలోచనల్లో కూరుకుపోయాడు.

అంతవరకు మభ్యపెట్టి, ప్రలోభంలో పడవేసిన అతడి మనసు పూర్తిగా అతని ఆధీనంలోకి వచ్చింది.

ఇప్పుడు అతని మనసు నిర్మలంగా ఉంది. దురాలోచనలనుంచి దూరం అయ్యాననే సంతృప్తితో ఉమావల్లి తన గదిలోకి నడిచాడు. ఆమెకు రెండుచేతులూ జోడించి- "అమ్మా... నేను శ్రీనివాసులు దగ్గర యాభైవేలు అప్పు తీసుకున్నాను, కొద్దిరోజుల్లో తిరిగి ఇచ్చేస్తాను. ఆయన దగ్గర అప్పు తీసుకున్నవాళ్ళంతా తిరిగి ఇస్తారనే నా నమ్మకం... వీటికి సంబంధించి కంప్యూటర్‌లో ఏ సమాచారమూ లేదు... అయినా ఫరవాలేదు. ఆయన దగ్గర తీసుకున్నవాళ్ళంతా తిరిగి ఇచ్చేస్తారు. ఇది మా గొప్పతనం కాదు. శ్రీనివాసులు ఔన్నత్యం," అని చెప్పడం ముగించిన ఈశ్వరరావుకు ఆమె కన్నీళ్ళతోనే నమస్కారం చేసింది.

ఈశ్వరరావు ఆ గదినుంచి బైటకు వచ్చాడు. దూరంగా కొడుకు వెళ్ళిపోతూ కనిపించాడు. "ఆగు నాన్నా...!" అంటూ కొడుకును పిలిచాడు. కొడుకు ఆగాడు. ఈశ్వరరావు గబగబా ముందుకు నడిచాడు. కొడుకు మెల్లగా అడుగులేస్తున్నాడు. ఈశ్వరరావు అతడిని అనుసరిస్తున్నాడు. చిన్నప్పుడు తప్పటడుగులు వేసిన కొడుకును నడిపించిన ఆ తండ్రి కొడుకు దగ్గర నడక నేర్చుకుంటున్నాడు. కొడుకును చూసి గర్వపడుతూ ముందుకు నడుస్తున్నాడు.

★


**రచయిత చిరునామా:**
**డాక్టర్ ఎమ్.సుగుణరావు,**
**39-164,**
**మాధవ ధార,**
**విశాఖపట్నం- 30007.**